క్లుప్తంగా

స్వర్ణాంధ్ర అధ్యాపకుడికి డాక్టరేట్


పత్సమట్ల సత్యనారాయణరాజు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పత్సమట్ల సత్యనారాయణరాజు కు డాక్టరేట్ లభించింది. స్ట్రెంత్ అండ్ థర్మల్ అనాలసిస్ ఆఫ్ సౌండ్ విచ్ పైప్ డీప్ వాటర్ అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు గానూ ఒరిస్సాకు చెందిన గుణుపూర్ గైట్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎల్ శర్మ చేతుల మీదుగా సత్యనారాయణరాజు డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు స్వర్ణాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపీచంద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ డిగ్రీని అందుకున్న సత్యనారాయణరాజును శనివారం కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, సైట్ కళాశాల ప్రిన్సిపాల్ పండరీనాథ్ తదితరులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీకి విజయం ఖాయం


మద్దా చంద్రకళ


పాలకొల్లు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ జోస్యం చెప్పారు. ఈ మేరకు చంద్రకళ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ 135 స్థానాలు పైగా గెలవబోతోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం మహాసభలు నిర్వహించి, బస్సు యాత్ర ద్వారా బహిరంగ సభలను సీఎం జగన్ నిర్వహించి వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కేడర్‌లో కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రానుందనే ఉత్సాహంతో ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో గ్రామీణ ఓటర్లు, ముఖ్యంగా మహిళా ఓటర్లు అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చంద్రకళ తెలిపారు. సీఎం జగన్ గత ఐదేళ్లుగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని వివరించారు.

అన్నప్రసాద వితరణకు ప్లేట్లు అందజేత


పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్లేట్లు అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం భక్తులకు స్వామివారి అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాత జీఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ దంపతులు శనివారం రూ. 10 వేలు విలువ చేసే ప్లేట్లు, బకెట్లు ఆలయ ప్రధానార్చకులు రమణ గురుస్వామికి అందజేశారు. దాతల సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను సత్కరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి వార్ల కల్యాణోత్సవం స్థానిక సంత మార్కెట్ వద్ద ఉన్న ఆలయంలో శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను, అమ్మవారిని పెండ్లి కుమారుడు, కుమార్తెగా అలంకరించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణ తంతు జరిపించారు. కల్యాణ పీటలపై కొప్పర్తి మణికంఠ మంగరాజు, తనూజ దంపతులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా, పట్టణ, అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు, పట్నాల రామకృష్ణ, తామరపల్లి సత్య శ్రీనివాస్, పెదగాడి కృష్ణ, గెడ్డం నాగేశ్వరరావు, పట్నాల భసవాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

తగ్గిపోయిన జీడిమామిడి విస్తీర్ణం

- తగ్గిపోయిన జీడిమామిడి విస్తీర్ణం
- దిగుబడి రాకపోవడంతో చెట్లు నరికేస్తున్న వైనం
- కొత్తగా జీడిమామిడి మొక్కలు వేయడానికి ముందుకు రాని రైతులు


మొగల్తూరులో దిగుబడి లేని జీడిమామిడి తోట

మొగల్తూరు: ఒకప్పుడు మొగల్తూరు మండలం జీడిమామిడి పంటకు ఎంతో ప్రసిద్ధి. కేవలం జీడిపిక్క అమ్మడమే కాకుండా పండ్ల రసాయనాల తయారీకి ఇక్కడ నుంచి పెద్ద మొత్తంలో జీడిమామిడిని కొనుగోలు చేసేవారు. అయితే కాలం గడుస్తున్న కొద్దీ జీడి మామిడి పంట పెద్ద లాభాలను తెచ్చిపెట్టకపోవడంతో పాటు దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. వేసవిలో వడగాల్పుల నుండి రక్షణనిచ్చే జీడి మామిడి తోటలు పత్యేకంగా లేకపోయినా అంతర్గత పంటగా ఉండేది. అధికారుల అంచనాల మేరకు గతంతో ఆరు వందల ఎకరాలుండే జీడి మామిడి ప్రస్తుతం రెండు వందల ఎకరాలకు పడిపోయింది.

ఏప్రిల్ నుండి జూన్ వరకు లభ్యం

ప్రతి ఏటా ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు జీడి మామిడి పండ్లు లభ్యమవుతాయి. పూత పూయడానికి ప్రత్యేకంగా మందులున్నా కొద్ది మంది రైతులు మాత్రమే పిచికారీ చేస్తారు.జీడి పండుకు కింద భాగంతో గింజ ఉంటుంది. పచ్చి గింజలను మాంసాహారాల్లోను, కూరగాయల్లోను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే పచ్చి గింజ కన్నా ఎండు గింజపైనే మక్కువ చూపుతారు. అంతే కాక పచ్చి గింజలను ఎండలో ఆరబెట్టి బాగా ఎండిన తరువాత బస్తాల లెక్కన హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తారు. జీడి పండ్లు కన్నా గింజలపైనే ఎక్కువుగా ఆదాయం వస్తుంది. అయితే జీడిగింజలను కోసి ఆరబెట్టి వ్యాపారులకు అమ్మడం రైతుకు తలకుమించిన భారం అవుతుంది. గింజలు బాగాలేదనో ధరలేదనో కారణం చెప్పి అయిన కాడికి కొనుగోలు చేస్తున్నారు.

ధర రావడం లేదని గగ్గోలు

జీడి గింజలను కాల్చడం, బద్ద, పప్పులుగా వేరు చేయడం ఎంతో కష్టంతో కూడిన పనికావడంతో రైతులు గింజల గానే అమ్మేస్తున్నారు. గతంలో కూలి రేట్లు తక్కువుగా ఉన్నప్పుడు ఎంత వస్తుందో రేట్లు పెరిగిన తరువాత కూడా అంతే ధర పలకడంతో రైతులు గింజలను ఎండబెటి అమ్మేస్తున్నారు. ఎండిన గింజలు కేజీ రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుంది. దీంతో రైతులు జీడి చెట్లను అయిన కాడికి అమ్మేసుకుంటున్నారు. జీడి చెట్టు కలపను ఇటుక బట్టీలకు ఎక్కువుగా ఉపయోగిస్తుండడంతో ఎంతో కొంత ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో రైతులు చెట్టను అమ్మేస్తున్నారు. రాబోయే రోజుల్లో జీడి చెట్లు ఆనవాళ్లు కూడా కనిపించవేమోనంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

గింజలను ఒబ్బిడి చేయడం కష్టం



గింజలను ఒబ్బిడి చేయడం కష్టంతో కూడిన పని. చెట్ల కొమ్మలు కిందకు వేలాడుతుండటంతో జీడి పండ్లు ఏరాలంటే చాలా శ్రమతో కూడిన పని. కూలీ రేట్లు కూడా పెరిగిపోవడం, దిగుబడి లేకపోవడంతో రైతులు జీడిచెట్ల పెంపకంపై శ్రద్ధ చూపడం లేదు.

– బొడ్డుపల్లి సుబ్బారావు, మొగల్తూరు:

గిట్టుబాటు ధర రావడం లేదు



జీడి తోటలంటూ ప్రత్యేకంగా లేకపోయినా మామిడి సపోటా తోటల్లో అంతర్గతంగా ఉంటాయి. అయితే పండ్లు కోసి గింజలు ఎండబెట్టి అమ్ముతుంటే గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో రైతులు జీడి చెట్లను ఇటుక బట్టీలకు అమ్మేస్తున్నారు.

– పిప్పళ్ల గోపి, పిప్పళ్లవారితోట

వంతెన మార్గం ప్రమాదకరం


ప్రమాదకరంగా ఉన్న వంతెన మార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ,ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. ఎంతోకాలంగా ఈ వంతెన మార్గంవైపు రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

సంయమనం పాటించాలి


వి.స్వామి నాయుడు

పెనుగొండ: నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్స్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్‌లో భీమవరంలో పటిష్ట భద్రతల మధ్య జాగ్రత్తగా భద్రపర్చామని, ఏదైనా సంఘటనపై స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా సంయమనం పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మీఫోర్స్, పోలీస్ టీంలు నిత్య పర్యవేక్షణ ఉంటుందని, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలో మూడంచెల భద్రత పహారా ఉందని వివరించారు. జూన్ 4న నియోజకవర్గంలో పోల్ అయిన ఓట్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కిస్తారని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, జూన్ 4 వరకూ ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పరమైన సమావేశాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. గ్రామాల్లోకవ్వింపు చర్యలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆహా ఏమి సౌందర్యం

ఏదో గోదావరి నీటి అలలను దొంతరులుగా పేర్చినట్టు ఓ వైపు, పై నుంచి ఆకాశం నీడ పడుతుంటే నీటి ప్రవాహాన్ని రెండుగా వేరుచేసినట్టు అలరిస్తోంది కదూ ఈ దృశ్యం. ఇక పైన ఆకాశంలో మేఘాలు ఏవో భవంతులు కట్టినట్టుగా అలరిస్తున్నాయి. నరసాపురం వశిష్ట గోదావరి వలంధర్‌రేవులో శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కనిపించిన సుందర దృశ్యం ఇది. రెండు రోజుల ఆటు కమ్మిని మేఘాలు తొలిగిపోయి మళ్లీ సూరీడు రానా..వద్దా? అన్నట్టుగా నీటి ఎండతో దోబూచులాడుతుండగా ఇంద్ర ధనస్సు గోచరించే సమయంలో గోదావరి నీరు కూడా నీటి ఆకారంలో మారి కనివిందు చేసిన దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. – నరసాపురం

నరసాపురం వశిష్ట గోదావరి వలంధర్‌రేవులో సుందర దశ్యం →



అధిక రక్తపోటుపై అవగాహన


పాలమూరులో అధిక రక్తపోటు నివారణపై అవగాహన కల్పిస్తున్న గుడాల హరిబాబు

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజల్లో ఎక్కువశాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు చెప్పారు. మండలంలోని పాలమూరులో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు అధిక రక్తపోటుపై అవగాహన కల్పించారు. 30 సంవత్సరాలు దాటినవారికి బీపీ పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారిని గుర్తించి మందులు అందజేసి సూచనలు చేశారు. ప్రతిరోజూ ఆహారంలో ఉప్పుశాతం పెరగడం వల్ల అధిక రక్తపోటు పెరుగుతుందని, దీనివలన గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. శిబిరంలో డాక్టర్ నవ్యజీవన్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ డి.కమల, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నిర్లక్ష్యంతో విద్యార్థుల అవస్థలు


బెంగుళూరు వెళ్లడానికి రాత్రి 10.30 గంటల సమయంలో వచ్చిన బస్సు ఎక్కుతున్న విద్యార్థినులు


రెండు సీట్లల్లో ముగ్గురు విద్యార్థినులు కూర్చున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని దాసరి నారాయణరావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిర్లక్ష్యంతో విద్యార్థినులు అవస్థలకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రతలో భాగంగా విద్యార్థులకు వివిధ పరిశ్రమల్లో నైపుణ్యాన్ని తెలుసుకుని తద్వారా ఉద్యోగాలను సంపాదించుకునే అవకాశాలు కల్పించడానికి 2020–21 సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ ఇంటర్న్‌షిప్‌లో బెంగుళూరు వెళ్లడానికి పట్టణంలోని దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను శనివారం ఉదయం 9 గంటలకు కళాశాలకు రావాలని కళాశాల అధ్యాపకులు సందేశం ఇవ్వడంతో విద్యార్థినులంతా కళాశాలకు తమ దుస్తుల బ్యాగ్‌లతో తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. రాత్రి 10.30 గంటల వరకూ బస్‌లు రాకపోవడంతో అసలు ఇంటర్న్‌షిప్ ఉందా లేదా అనే అనుమానం విద్యార్థినుల తల్లిదండ్రుల్లో కలిగింది. అయితే బస్సు రాకపోవడంపై అధ్యాపకులకు ప్రశ్నించగా బస్సు రాజమండ్రిలో ఉంది..మార్టేరులో ఉంది.. జిన్నూరులో ఉందని సాకులు చెప్పుతూ వచ్చారు. అయితే అసలు అధ్యాపకులు సాయంత్రం 4 గంటల వరకూ బస్సే మాట్లాడలేదనే విషయం తెలిసింది. దీంతో తల్లిదండ్రులు గొడవ చేసే పరిస్థితి రావడంతో కళాశాల అధ్యాపకులు 4.30 గంటలకు వైజాగ్ నుంచి ఓ ట్రావెల్ బస్, రాజమండ్రి నుండి ఓ టెంపోను మాట్లాడడంతో రెండు వాహనాలు రాత్రి 10.30 గంటలకు పాలకొల్లు కళాశాల వద్దకు చేరుకున్నాయి. మొత్తం విద్యార్థినులు 66 మంది ఇంటర్న్‌షిప్‌కు బెంగుళూరు వెళ్లాల్సి ఉండగా 40 సీటర్ బస్‌లో 55 మందిని కూర్చోబెట్టారు. అలాగే టెంపోలో కళాశాల అధ్యాపకులతో కలిపి 14 మంది కూర్చుని బెంగుళూరుకు పయనమయ్యారు. అయితే రెండు నెలలు పాటు ఈ ఇంటర్న్‌షిప్ జరగనున్నట్లు విద్యార్థినులు తెలిపారు.

భీమవరం సబ్‌జైలు పరిశీలన

భీమవరం: స్థానిక సబ్ జైలును మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎ.సురేష్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జడ్జి సురేష్‌బాబు ముద్దాయిలతో నేరుగా మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకుని నేర ప్రవృత్తిని విడనాడాలన్నారు. కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమతలేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ప్రతి శనివారం ఉచిత న్యాయవాది, వలంటీర్లు జైలును సందర్శిస్తారని వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు బేతపూడి లోకేశ్వరరావు, ఎంబీ భవాని, జైలు సూపరెంటెండెంట్ వెంకటగిరి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత జయంతి




సిద్ధాంతంలో వాసవీమాత గ్రామోత్సవం
మొగల్తూరులో వాసవిమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు →

మొగల్తూరు: తొలి త్యాగశీలిగా పేరుగాంచిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు 102 కలశాలతో స్థానిక రామాలయయం నుంచి ఊరేగింపుగా ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకున్నారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వాసవీ మాత చిత్రపటాలకు గణపతి హోమం, వాసవీ హోమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిద్ధాంతంలో

పెనుగొండ: వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి పురష్కరించుకుని సిద్ధాంతంలో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద వాసవీ మాతకు పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వాసవీ భక్తులు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు ధరించి వాసవీ నామ స్మరణ చేస్తూ కనుల పండుగగా గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు


మొగల్తూరులో వెంకన్న ప్రత్యేక అలంకరణ


ప్రతేకాలంకరణలో వేములదీవి వెంకన్న

మొగల్తూరు: స్థానిక కేతకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదవితరణ నిర్వహించారు.

వైభవ వేంకటేశ్వరుని అలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు వైభవ వెంకటేశ్వరునిగా పూలతో ప్రత్యేంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

వారతిప్పలో పంటబోదె తవ్వకం పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు చేపట్టారు. వారతిప్ప గ్రామంలో ఉన్న చెరువును నింపేందుకు వీలుగా శనివారం గ్రామంలోని పంటబోద తవ్వకం పనులు ప్రారంభించారు. భీమవరం మండలంలోని గునుపూడి గ్రామం ద్వారా బేతపూడి, వెంప గ్రామాల మీదుగా వారతిప్ప గ్రామం వరకు నీరు ప్రవహిస్తుంది. గ్రామంలోని ప్రజల అవసరాలు తీర్చేందుకు వినియోగించుకుంటున్న చెరువును ఈ నీటి ద్వారా నింపుతారు. దీంతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరందేలా వారతిప్ప గ్రామంలో చేపట్టిన పంట బోదె తవ్వకం పనులను జేఈ ఆనంద్ పరిశీలించారు.

చిదంబరానికి సత్కారం


కలిగినీడి చిదంబరాన్ని సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

నరసాపురం: కలిగినీడి చిదంబరం తన సేవలతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా నరసాపురం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారని నరసాపురం నియోజకవర్గ కాపుసంఘం నాయకులు పేర్కొన్నారు. ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పట్టణానికి చెందిన చిదంబరం శనివారం పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లిలోని తన సొంతింటికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాపుసంఘం నాయకులు చిదంబరాన్ని ఘజమాలతో సత్కరించారు. మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కోటిపల్లి సురేష్, చిట్టూరి కృష్ణ, తెన్నేటి గిరి, బళ్ల తాతాజీ, వన్నెంరెడ్డి శ్రీనివాస్, పోలిశెట్టి సూరిబాబు, అందే వెంకటకృష్ణ, మేడిది రాము తదితరులు పాల్గొన్నారు.